క్లుప్తంగా

నేడు కందులవారిపాలెంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఎన్నికల హామీలను సక్రమంగా అమలు చేయనందున ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని కందులవారిపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం 5 గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు బుధవారం తెలిపారు. ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీటెక్ విద్యార్థికి డీఎస్పీ ఆర్థిక సాయం



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన నిరుపేద ఆర్యవైశ్యుడు మాజేటి హరిప్రసాద్ రెండవ కుమారుడు హర్ష ఆర్కే ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్ ఫీజుకు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా సబ్‌కోర్టు మాజీ ఏపీపీ బగ్గి నరసింహారావు సూచన మేరకు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు రూ.25 వేలు ఆర్థిక సాయం బుధవారం అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ కష్టపడి బాగా చదువుకొని భవిష్యత్తులో తల్లిదండ్రులకు, సమాజానికి సహాయ పడే స్థాయిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కోర్టు మాజీ ఏపీపీ బగ్గి నరసింహారావు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, మాజేటి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌ను సత్కరించిన రేషన్ డీలర్లు




క్రోసూరు: క్రోసూరు తహసీల్దార్ వి.వి.నాగరాజును మండలంలోని రేషన్ డీలర్లు బుధవారం ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న తహసీల్దార్ నాగరాజును అభినందిస్తూ డీలర్లు సత్కరించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ హరిబాబు మాట్లాడుతూ తహసీల్దార్‌కు ఉత్తమ అధికారి అవార్డు రావటం పట్ల డీలర్లందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు కొమ్మినేని సతీష్, మాదాసు సంజీవరావు పాల్గొన్నారు.

సొసైటీల అభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ల: గ్రామీణాభివృద్ధిలో కో ఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకమని, నూతనంగా నియమితులైన సంఘ ప్రతినిధులు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం సాయిబాబా ఆలయ ఆవరణలో ముప్పాళ్ల పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంఘం పరిధిలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరగా చెల్లించేలా చూడాలన్నారు. సంఘం చైర్మన్‌గా జెట్టి నాగమల్లేశ్వరరావు, డైరెక్టర్లుగా యర్రం అప్పిరెడ్డి, సాదు వెంకటశివయ్యలచే ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనాజా సమస్య పరిష్కరించాలని వినతి



సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి ఏరియాలో మసీదు వద్ద జనాజా(అంత్యక్రియల) సమయంలో గది లేకపోవటంతో ఇబ్బంది అవుతుందని, వర్షా కాలంలో మరింత ఇబ్బంది పడుతున్నామని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గౌస్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి విన్నవించారు. సుమారు 300 ముస్లిం కుటుంబాలు ఆ ప్రాంతంలో నివశిస్తున్నామని వివరించి అర్జీ అందచేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కన్నా మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్‌కు ఫోన్ చేసి జనాజాకు ఇబ్బందులు పడకూడదని, మసీదు వద్ద రెండు గదులు వీలయినంత త్వరగా మంజూరు చేసి నిర్మించాలన్నారు. ఎమ్మెల్యే కన్నాకు ముస్లిం పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

అందని ప్రయోజనం.. అవగాహన శూన్యం

- లేబర్ ఇన్సూరెన్స్‌కు కార్మికుల అనాసక్తి
- గణనీయంగా తగ్గిన రిజిస్ట్రేషన్‌లు, రెన్యువల్స్
- పెండింగ్‌లో పలు క్లెయిమ్‌లు



స్లాబ్ పనిలో భవన నిర్మాణ కార్మికులు

అమరావతి: ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా ప్రభుత్వ భవన నిర్మాణ రంగ కార్మికులు, నిర్మాణ రంగ అనుబంధ కార్మికులకు కార్మిక శాఖ ప్రయోజనాలు సమకూర్చలేకపోతుంది. ప్రభుత్వం కార్మికులకు ప్రసవ కానుక, సహజ మరణం, ప్రమాద మరణం.. ఇలా పలు రకాల ప్రయోజనాలు కల్పిస్తుంది. కానీ కొన్నేళ్లగా క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండడంతో నూతన కార్మిక బీమా రిజిస్ట్రేషన్‌లు, రెన్యువల్స్‌పై కార్మికులు ఆసక్తి చూపటం లేదు.

తగ్గిన దరఖాస్తులు

మండలంలో భవన నిర్మాణ కార్మికులు దానికి అనుబంధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేసే కార్మికులు, సుమారు 5-6 వేల మంది ఉన్నారు. గతంలో ఏటా సుమారు 1,000 నూతన, రెన్యువల్ దరఖాస్తులు వచ్చేవి. ప్రస్తుతం అవి 30-50కి తగ్గిపోయాయి. గతంలో కార్మిక శాఖ కార్యాలయంలో రుసుము కట్టించుకుని దరఖాస్తులు తీసుకునేవారు. ప్రస్తుతం బ్యాంకులో చలానా చెల్లించాల్సి రావటంతో నిరక్షరాస్యులైన కూలీలు ముందుకు రావటం లేదు.

పెండింగ్‌లో క్లెయిమ్‌లు

మండలంలో బీమా ప్రీమియం చెల్లించి.. ప్రసవ కానుక, ప్రమాద మరణం, సహజ మరణం ఇలాంటి ప్రయోజనాలకు సంబంధించిన క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. వీరికి కొన్నేళ్లగా బీమా ప్రయోజనాలు రావటం లేదు. ప్రసవ కానుక కింద 58, సహజ మరణం 27, ప్రమాద మరణం కింద 2 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కార్మికులు, కూలీలు ఏడాదికి రూ.22, ఐదేళ్లకు రూ.110 నామమాత్రపు రుసుము చెల్లించటానికి కూడా ముందుకు రావటం లేదు.

అవగాహన లోపం

గ్రామ స్థాయిలో కార్మికులకు ప్రయోజనాలను సమకూర్చే బీమాపై కార్మిక శాఖ ఎటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవటమే అసలు కారణంగా కనిపిస్తుంది. అలాగే 3 నెలలుగా అమరావతి కార్మిక శాఖాధికారి అనారోగ్య కారణాలతో సెలవులో ఉండగా.. గుంటూరు కార్మిక శాఖాధికారి ఇన్‌చార్జిగా వ్యవహరించటం, క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవటం మరొక కారణం. అలాగే కార్మిక శాఖ అధికారులు దుకాణాలు, చిన్న చిన్న పరిశ్రమలను పర్యవేక్షించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా కార్మిక శాఖ బీమాపై అవగాహన కల్పించి వీలైనంత ఎక్కువ మందిని బీమా పరిధి లోకి తేవాల్సిన అవసరం ఉంది.



అమరావతి కార్మిక శాఖ కార్యాలయం

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



ఎన్నికలకు ముందు కార్మిక సంక్షేమ బోర్డు పునఃప్రారంభించి కార్మికులకు అన్ని ప్రయోజనాలను కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వ పెద్దలు 14 నెలలైనా కార్మికుల సమస్యలపై నోరెత్తటం లేదు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే చెల్లిస్తామని ఇంత వరకు నిధులు కేటాయించ లేదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని కార్మికులకు రావాల్సిన అన్ని ప్రయోజనాలను చెల్లించాలి. అలాగే కార్మికులకు బీమాపై అవగాహన కల్పించాలి.

– బి.సూరిబాబు, సీఐటీయూ కార్యదర్శి, అమరావతి

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

కార్మిక శాఖ కార్యాలయంలో ప్రమాద బీమా దరఖాస్తులు ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం స్వీకరిస్తున్నాం. కూలీల బీమాకు 18 నుంచి 55 సంవత్సరాల స్త్రీ, పురుషులు అర్హులు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, బ్యాంకు చలానా జత చేసి దరఖాస్తులు ఇవ్వాలి. పాలసీదారు సహజ మరణం పొందితే రూ.80 వేలు, ప్రమాద మరణానికి రూ.5 లక్షలు, ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు రూ.20 వేల చొప్పున ప్రయోజనాలు అందుతాయి. క్లెయిమ్‌లకు ప్రభుత్వ నిర్ణయం మేరకు బీమా సొమ్మును అందజేస్తాం.

– ఎం.కోటేశ్వరరావు, ఇన్‌చార్జి కార్మిక శాఖాధికారి, అమరావతి

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం

- ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుది
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్ రెడ్డి



కట్టమూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో డాక్టర్ గజ్జల, నాయకులు

సత్తెనపల్లి: పరిపాలనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి విమర్శించారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఓట్ల కోసం ప్రజలను వంచించి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ఏడాది పాలన పూర్తి చేసుకున్నా నేటికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న ప్రతి హామీని అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది దాటినా ఇచ్చిన హామీల ఊసెత్తడం లేదన్నారు. ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. పింఛన్ పెంపు, తల్లికి వందనం అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. కొత్త పింఛన్లకు దిక్కులేక పోగా వికలాంగుల పెన్షన్లకు కోతలు విధిస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నాడు జగనన్న అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. పాలనలో తేడాను ప్రజలు గుర్తించి కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబు మోసాలపై ప్రజలకు క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కళ్ళం విజయభాస్కరరెడ్డి, సంకటి శ్యాంసన్, కొర్లకుంట వెంకటేశ్వర్లు, చిలుకా జైపాల్, కొమెర శివశంకర్, బొంతు వెంకటరెడ్డి, నందిగామ యల్లమంద, పారుపల్లి రాధాకృష్ణ, జె. నరసింహారావు సర్పంచ్ దార్ల సంధ్యాఏడుకొండలు, ఎంపీటీసీ బొగ్గరపు గోపయ్య, నాయకులు ఎం.పృథ్వి, పి.గోపి, ఎం.నరసింహారావు, ఎస్.దావీదు, టి.రోమన్ బాబు, జి.ఇస్సాక్, జి.కొండయ్య, షేక్ సుభాని, ఎం.అంజిబాబు, ఎం.మోహన్‌ప్రసాద్, టి.దేవదానం, ఎస్.తిరుముల తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

డీఎస్పీ హనుమంతరావు



నకరికల్లు: వినాయకచవితికి విగ్రహాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలనాని డీఎస్పీ బి.హనుమంతరావు ఆదేశించారు. వినాయకచవితి ఏర్పాట్లపై మండలంలోని కుంకలగుంట గ్రామంలో ప్రజలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చవితి వేడుకలను పార్టీలకు అతీతంగా స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడి అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూజలు చేసే సమయంలో మాత్రమే మైక్ వినియోగించాలన్నారు. ఊరేగింపులను రాత్రి 10 గంటలలోపే ముగించాలన్నారు. అనుమతులు తీసుకునే క్రమంలో విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం తేదీ, రూట్ మ్యాప్, నిమజ్జనానికి వినియోగించే వాహనం వివరాలు ముందుగా తెలియజేయాలన్నారు. విద్యుత్ వినియోగానికి విద్యుత్ శాఖ అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ బి.కిరణ్, ఎస్ఐ చల్లా సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక మండపాలకు నిబంధనలు పాటించాలి

సీఐ నాగమల్లేశ్వరరావు



మాట్లాడుతున్న సీఐ నాగమల్లేశ్వరరావు

సత్తెనపల్లి: వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితిని అందరూ సంతోషంగా జరుపుకోవాలని, ఇతరులకు అసౌకర్యం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తితే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వినాయకుడిని ఏ మార్గంలో, ఏ సమయంలో నిమజ్జనం చేస్తారో ముందుగా తెలియజేయాలన్నారు. డీజేలకు పోలీస్ వారి ప్రత్యేక అనుమతి తీసుకోవాలని, మితిమీరిన శబ్దాలు, బాణసంచాకు అనుమతి లేదని, నిర్వాహకులు పోలీసులకు సహకరించి పండుగను మంచి వాతావరణంలో జరుపుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వ స్థలంలో మండపం ఏర్పాటు చేస్తుంటే మున్సిపాలిటీ అనుమతి, విద్యుత్ అధికారులు, మైకులకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ముఖ్యంగా రాత్రులు విగ్రహాల వద్ద కాపలా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. మండపాల ఏర్పాటు చేసే నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు పట్టణ ఎస్ఐలు పవన్ కుమార్, శ్రీనివాసరావు ఉన్నారు.

భారత ఎన్నికల సంఘాన్ని తప్పుబట్టటం దారుణం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అమరావతి: రాజ్యాంగ సంస్థ భారత ఎన్నికల సంఘాన్ని తప్పుబట్టటం దారుణమని కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి నోటి కొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. అలాగే రాహుల్‌గాంధీ అపరిపక్వ వ్యాఖ్యల వల్ల భారత రాజ్యాంగం పట్ల విశ్వాసం లేకుండా పోతుందన్నారు. ఈవీఎంల అవకతవకల గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్నప్పుడు ఈవీఎం వ్యవస్థను ఎందుకు రద్దు చేయలేదన్నారు. ఉనికి కోసం మాత్రమే కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ ఓటు చోరీ అనే కొత్త నినాదంతో రాద్ధాంతం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో సుమారు 150 స్కాములు జరిగాయని వాటికి కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలన్నారు. పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలికి 2024 ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాలేదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ నేరెళ్ల హనుమంతరావు, నరుకుళ్లపాడు సొసైటీ డైరెక్టర్ మద్ది ధాత్రినారాయణ, మునుగోడు మాజీ సర్పంచ్ మేకల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన
- సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఆకస్మిక తనిఖీలు



ఏరియా వైద్యశాలల సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన



రోగి సహాయకురాలితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన

సత్తెనపల్లి: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.ప్రసూన అన్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రోగులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఓపీ ఆపరేటర్లు నిర్దేశిత సమయానికి హాజరు కావాలని హెచ్చరించారు. అనంతరం డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలను సందర్శించానని, ఈ రెండు వైద్యశాలలో సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. అయితే కొన్ని లోపాలు ఉన్నాయని వాటిని సరిచేసుకోవాల్సి ఉందన్నారు. మళ్లీ తాను వచ్చే సమయానికి మార్పులు జరగాలని ఆదేశించినట్లు చెప్పారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో సదరంకు సంబంధించి ఈఎన్‌టీ కేవలం తెనాలిలో మాత్రమే ఉందని, ఈఎన్‌టీతో పాటు సైకియాట్రి కూడా ప్రారంభించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానన్నారు. సత్తెనపల్లి వైద్యశాలలో పాలు ఇచ్చే తల్లులకు కంగారు గది ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చానన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఓపీలో ఆధార్, స్మార్ట్ ఫోన్ రోగులు తెచ్చుకున్నట్లయితే హెల్త్ రికార్డ్స్ తయారు చేయవచ్చన్నారు. ఆధార్‌తో ఆరోగ్యశ్రీ సేవలు కూడా పొందడానికి వీలు ఉంటుందన్నారు. రోజుకు 80 ఎక్స్‌రేలు జరుగుతున్నాయని చెప్పారు. అల్ట్రాసౌండ్‌కు ఒప్పందం చేసుకోవాల్సి ఉందన్నారు. ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ ఉన్నట్లయితే వైద్యశాల అన్ని విభాగాల్లో పర్ఫెక్ట్‌గా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి ఆమె ప్రత్యేక సూచనలు చేశారు. ఆమెతో పాటు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రాజేశ్వరి, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వికలాంగ పెన్షనర్లపై వేటు



మండలంలోని రోకటిగుంటవారిపాలెం గ్రామానికి చెందిన తోట నాగరాజుకు వయస్సు సుమారు 20 కన్నా ఎక్కువ. గత ఐదారేళ్లుగా పెన్షన్ పొందుతున్నాడు. ఇతనికి కాళ్లు, చేతులు పనిచేయవు. తల్లిదండ్రులు లేపితేగాని లేవలేని పరిస్థితి. అలాంటి అతనికి అంగ వైకల్యశాతం తక్కువగా ఉందంటూ పెన్షన్ నిలిపివేస్తున్నగా అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయం నుంచి నోటీసు పంపారు.



అచ్చంపేటకు చెందిన ఆదూరి ఈశ్వర్ సుందర్‌కు 91 శాతం అంగ వైకల్యం ఉన్నట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. ఇతనికి రెండు, కాళ్లు రెండు చేతులు అసలు పనిచేయలేవు. తల్లి నోట్లో అన్నం పెడితే గాని తినలేని పరిస్థితి. వైద్య పరీక్షల పునఃపరిశీలనలో ఇతనికి 40 శాతం కంటే తక్కువగా అంగ వైకల్యం ఉన్నందున పెన్షన్ నిలిపివేస్తున్నట్లుగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు నోటీసు పంపించారు.



అచ్చంపేటకు చెందిన షేక్ గౌస్ బాజీ ఎన్నో సంవత్సరాలుగా పెన్షన్ తీసుకుంటున్నాడు. ఇతనికి మతి స్థిమితం ఉండదు. ఇతను ఎక్కడికి వెళ్లినా తల్లిదండ్రులు తోడుగా వెళ్లాలి. వైద్య పరీక్షల పునఃపరిశీలనలో ఇతనికి అంగ వైకల్యశాతం తక్కువగా ఉన్నట్లు పేర్కొంటూ వికలాంగుల పెన్షన్ నిలిపి వేస్తున్నట్లుగా నోటీసు పంపారు.

- సెప్టెంబరు నుంచి నిలిపివేతకు శ్రీకారం
- మండలంలో 43 మంది దివ్యాంగులకు నోటీసులు
- ఆందోళనలో దివ్యాంగులు

అచ్చంపేట: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దివ్యాంగులకు పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంపు మూణ్నాళ్ల ముచ్చటైంది. ఏడాది కూడా గడవక ముందే పెన్షనర్ల సంఖ్యను తగ్గించాలన్న మీమాంశ్సలో ప్రభుత్వం నిమగ్నమైంది. కొంతమంది దివ్యాంగులు మంచంపై నుంచి లేవలేని, తల్లి అన్నం పెడితే గాని తినలేని, లేచి కూర్చోలేని పెన్షనర్లకు మీరు అనర్హులంటూ నోటీసులివ్వడం విస్మయాన్ని కలిగిస్తోంది. 90 శాతానికి పైగా అంగవైకల్యం ధ్రువీకరణ పొంది రూ.15 వేల పెన్షన్‌కు అర్హత ఉన్న మాకు రూ.6 వేల పెన్షన్‌కు కూడా అనర్హులంటూ నోటీసు లివ్వడం ఏమిటంటూ బాధిత దివ్యాంగులు ప్రశ్నిస్తున్నారు.

- ప్రస్తుతం వికలాంగుల పెన్షన్లు పొందుతున్న వారందరికీ పునఃపరిశీలనలో భాగంగా విడతల వారీగా ప్రభుత్వ వైద్యశాలలో అంగ వైకల్యశాతాన్ని నిర్ధారించేందుకు పరీక్షలు నిర్వహించారు. ఆ పరీక్షలలో 90 శాతానికి పైగా ఉన్న అనేక మందికి 40 శాతం కంటే తక్కువగా నిర్ధారించి అనర్హులుగా గుర్తించారు. వారందరికీ మండలంలో గత రెండు మూడు రోజులుగా నోటీసులు ఇస్తున్నారు. ఆ నోటీసులు చూసి వికలాంగులు, వారి తల్లిదండ్రులు అవాక్కవుతున్నారు.

వికలాంగులను టార్గెట్ చేయడం అమానుషం

అచ్చంపేట మండలంలో 43 మంది పెన్షన్లు సెప్టెంబరు నుంచి నిలిపివేస్తున్నట్లుగా ఎంపీడీవో కార్యాలయం వారు గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా నోటీసులు పంపారు. వీరందరిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశాం. వీరిలో ఏ ఒక్కరు 90 శాతం అంగవైకల్యం ఉన్నవారు లేరు. అంగ వైకల్యం కాని వారు ఎంతో మంది పెన్షన్లు తీసుకుంటున్నారు. వారి జోలికి వెళ్లకుండా వీరికే ఎందుకు నోటీసులిచ్చారో తెలియదు. వాస్తవానికి వీరికి రూ.5 వేలు కాదు, రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలి. వీరంతా కడుబీదవారు. తల్లిదండ్రులు ఎంతో ఇబ్బందులు పడుతూ వీరిని పెంచుకుంటున్నారు. అలాంటి వారి పెన్షన్లు తొలగించి అన్యాయం చేయొద్దు.

– షేక్ కమల్‌సైదా, సామాజిక కార్యకర్త, అచ్చంపేట

ధరణికోటలో పొలం పిలుస్తోంది



అమరావతి: మండలంలోని ధరణికోట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా డ్యాక్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ పాల్గొని రైతులకు పత్తిలో పాటించ వలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏవో అహ్మద్ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రాలలో ఈ క్రాప్ బుకింగ్ మొదలు పెట్టడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయనున్నాం

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి



మాట్లాడుతున్న అమలకుమారి

సత్తెనపల్లి: జిల్లాలోని ప్రతి గ్రామంలో ఈ సంవత్సరం ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయనున్నామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి గ్రామానికి విస్తరింపజేసే లక్ష్యంతో సత్తెనపల్లి వ్యవసాయ విత్తన పరిశోధన కేంద్రంలో మూడు రోజులుగా రైతు సేవా కేంద్రం సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు అంతర పంటల విధానాన్ని ఆచరించడం వలన అదనపు ఆదాయంతో పాటు మిరపలో తామర పురుగు, రసం పీల్చే పురుగులను నివారించవచ్చన్నారు. జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ సంవత్సరం సత్తెనపల్లి డివిజన్ పరిధిలో మొత్తం 21 క్లస్టర్లలో 2,625 మంది రైతులు, 2,625 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. పెదకూరపాడు ఏవో కృష్ణయ్య మాట్లాడుతూ రైతు సేవా కేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ శిక్షణలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, పెదకూరపాడు మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బందికి మార్గదర్శనం చేశారు. అనంతరం ఉత్సాహవంతమైన వీఏఏ, వీహెచ్ఏలకు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి చేతుల మీదుగా మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ ఏవోలు బి.సుబ్బారెడ్డి, ఎస్.శ్రీధర్ రెడ్డి, జిల్లా శిక్షకులు సైదయ్య, నందకుమార్, హనుమయ్య, డివిజన్ మాస్టర్ ట్రైనర్ మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జిలు బ్యూలా, అమూల్య, పూజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ఆర్బీఎస్‌కే జిల్లా అధికారి రాజేశ్వరి



క్రోసూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆర్బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) జిల్లా అధికారి రాజేశ్వరి కోరారు. ఈ నెల 12న జరిగిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం మ్యాప్ అప్ సందర్భంగా ఆమె క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె హెచ్ఎం బాబురావును విద్యార్థులందరికీ నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేసారా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలం మొత్తంలో మిగిలిపోయిన 549 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించటం జరిగిందన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమం విజయవంతం చేసిన పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్, ఆర్బీఎస్‌కే సూపర్‌వైజర్ కరిముల్లా పాల్గొన్నారు.